శత వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందాం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మన్సూరాబాద్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) శత వసంతోత్సవాలను ఈ నెల 26న కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర నాయకుడు ఆందోజు రవీంద్రచారి పేర్కొన్నారు. హయత్‌నగర్‌లో గురువారం నిర్వహించిన కరపత్రాల ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో వంద సంవత్సరాల చరిత్ర కలిగిన ఏకైక పార్టీ సీపీఐ అని వంద సంవత్సరాల్లో అధికారం, పదవులు లేకున్నా అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలు, రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వాల తప్పిదాలను ఎండగడుతూ ప్రజా, విద్యార్థి, ఉద్యోగ, మహిళా సమస్యలపై పోరాటాలు చేస్తామని గుర్తుచేశారు. ఎర్రకోటపై ఎర్రజెండా ఎగరవేసే దిశగా పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, నర్సింహా, శ్రీదేవి, షైమిదా, శోభన్, రాములుగౌడ్, సుధాకర్, సౌజన్య, జయంత్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ పరిధిలో అనుమతులు లేకుండా, నిబంధనలు ఉల్లంఘించి వ్యాపార సముదాయాలు, భారీ భవంతులు నిర్మిస్తున్నారని వివిధ కాలనీలవాసులు గురువారం నిరసనకు దిగారు. జిల్లా పరిషత్ రోడ్డు, శ్రీరమణ కాలనీ, కస్తూరికాలనీ, హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీ, పిండి నారాయణరెడ్డినగర్‌కాలనీ, ద్వారకా తిరుమలకాలనీ, భాగ్యనగర్‌కాలనీల్లో నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీలవాసులు ఆరోపిస్తున్నారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, డీసీ, టౌన్‌ప్లానింగ్ అధికారులకు గత నెల 26న భాగ్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా


నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

ఎలాంటి స్పందన లేదని ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మంతెన మహేశ్, వై.నవీన్‌కుమార్, గోపాల్‌రావు, నరేంద్రబాబు పాల్గొన్నారు.

నిధుల మంజూరు.. పనులు షురూ


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్..

మలక్‌పేట: మూసారంబాగ్ డివిజన్ గాంధీనగర్ కాలనీ పార్కు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా మారింది. ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు రాక పార్కుకు తాళం వేశారు. పార్కులో సౌకర్యాలు కల్పించాలని స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఈ సమస్యపై ఈ నెల 17న 'ఉద్యానం.. నిర్వహణ కరువై అధ్వానం' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, అధికారులు స్పందించారు. పార్కు అభివృద్ధి కోసం రూ.18 లక్షలు నిధులు కేటాయించారు. కాలనీవాసులతో కలిసి కార్పొరేటర్ గురువారం అభివృద్ధి పనులను ప్రారంభించారు.



సాక్షిలో ప్రచురితమైన కథనం

పార్కులో కమ్యూనిటీహాల్, బోర్‌వెల్, వాకింగ్ పాత్, గ్రీనరీ, తదితర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. పార్కులో సౌకర్యాల కల్పనకు చొరవ చూపిన సాక్షికి స్థానికులు, వాకర్స్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రవీణ్ యాదవ్, అశోక్, నర్సింగ్, సాయిరామ్, సందీప్, సూపర్‌వైజర్ జగన్నాథ్, బీజేపీ నాయకులు సందీప్ రెడ్డి, దినేష్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయండి



హస్తినాపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా కాలనీలవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమలానగర్ కాలనీలోని రోడ్డు నంబర్-7లో చేపట్టిన డ్రైనేజీ పనులను అర్ధాంతరంగా వదిలివేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో డ్రైనేజీ నిర్మాణం కోసం గత రెండు నెలల క్రితం ఇష్టానుసారంగా తవ్వి వదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పనుల పరిశీలన

నాగోలు: కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూగర్భ డ్రైనేజీ లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. మోహన్‌నగర్ కాలనీ వాటర్ ట్యాంక్ ఎదురుగా రూ.12 లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన డ్రైనేజీ లైన్ పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట జలమండలి సూపర్‌వైజర్ దయాకర్, నాయకులు వగ్గల సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, భాస్కర్ ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

పెంటమరాజు సుదర్శన్‌రావు జీవితం యువతకు ఆదర్శం


మంత్రి జూపల్లి కృష్ణారావుకు పుస్తకం అందజేస్తున్న రామచంద్రరావు

దిల్‌సుఖ్‌నగర్: అంటరానితనంపై పోరాటం చేసే దళితులకు ఆలయ ప్రవేశం కల్పించిన సంఘ సంస్కర్త పెంటమరాజు సుదర్శన్‌రావు అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. స్వాతంత్ర సమరయోధులు పెంటమరాజు సుదర్శన్ రావు జీవితం ఆధారంగా ప్రముఖ సంపాదకులు హెచ్. రమేష్ బాబు రాసిన మన గాంధీ పుస్తకాన్ని గురువారం యస్.ఆర్.ఆర్. ట్రస్ట్ చైర్మన్ యస్. రామచంద్రరావు మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సుదర్శన్‌రావు మద్యపాన నిషేధం పోరాటంలో చాలా కీలకమైన పాత్రను పోషించారని గుర్తు చేశారు. తాను జిల్లా మంత్రిగా ఉండి చాలాసార్లు స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకొని సుదర్శన్‌రావును సత్కరించే అవకాశం కలిగిందన్నారు. సుదర్శన్‌రావు జీవితం నేటితరం యువతకు ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో దినకర్, వెన్నల, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. నాగోలు జైపురికాలనీలో నివాసముండే నల్లగట్టు మహేష్(25) పూజిత భార్యాభర్తలు, మహేష్ స్థానికంగా పెయింటర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 20న కిరాణా దుకాణానికి వెళ్లిన మహేష్ ఎంతకీ ఇంటికి రాలేదు. సీమ్ ఇంట్లోనే పెట్టి ఫోన్ తీసుకెళ్లాడు. బంధువులు, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో గురువారం పూజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.


మహేష్

వైఎస్సార్ విగ్రహాన్ని తొలగిస్తే ఊరుకునేది లేదు


దిమ్మెను కూల్చిన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న జక్కిడి ప్రభాకర్‌రెడ్డి


జీహెచ్‌ఎంసీ అధికారులను ప్రశ్నిస్తున్న నాయకులు

టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్: జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పేరుతో ఎల్‌బీనగర్‌లోని కామినేని చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఏళ్ల నాటి వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు యత్నిస్తున్నారని టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కామినేని చౌరస్తా వద్ద వైఎస్సార్ విగ్రహ దిమ్మెను కూల్చివేస్తున్నారనే సమాచారం మేరకు గురువారం ఆయన ఘటనా స్థలానికి చేరుకుని కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి నిర్మాణ పనులను అడ్డుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని 14 ఏళ్ల క్రితం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేశామని జంక్షన్ల అభివృద్ధి సుందరీకరణ పేరుతో వైఎస్సార్ విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే ఈ ప్రాంతం నుంచి తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో వైఎస్సార్ విగ్రహ దిమ్మెను కూల్చడం పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులపై మండిపడ్డారు. పాత విగ్రహం స్థానంలో నూతన విగ్రహం ఏర్పాటు చేసి, జంక్షన్‌ను అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను కోరారు. వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించేందుకు చేపట్టే చర్యలను స్థానిక ఎమ్మెల్యే, జీహెచ్‌ఎంసీ అధికారులు విరమించుకోవాలని, లేని పక్షంలో తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఎస్సీసెల్ మాజీ చైర్మన్ జోగు రాములు, నేతలు ఎర్రంబెల్లి సతీష్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, యాదగిరి, అక్రమ్, శ్యామల్‌రెడ్డి, పృథ్వీరాజ్, రమేష్, వెంకట్, స్వామి, నగేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ చౌరస్తాగా నామకరణం చేయిస్తా



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించేందుకు యత్నిస్తున్నారు. ఎల్‌బీనగర్‌లోని వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించేందుకు పెద్ద కుట్ర జరుగుతుంది. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. వైఎస్సార్ విగ్రహాన్ని తొలగిస్తే ఊరుకునే ప్రసక్తి లేదు. కామినేని చౌరస్తాను వైఎస్సార్ చౌరస్తా, ఆక్సిజన్ పార్కును వైఎస్సార్ పార్కుగా నామకరణం చేయిస్తా.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు..

రెడ్‌క్రాస్, గౌతంనగర్, చర్చి గడ్డిఅన్నారం, సాహితినగర్, లలితానగర్, మధురాపురి, మైత్రీ నగర్, కృష్ణనగర్, ఎస్‌బీహెచ్ కాలనీ, భవానీ నగర్, హనుమాన్ టెంపుల్, మనోరమ ఐటీఐ, విద్యుత్‌నగర్, పంచఫార్మా ఎస్‌ఐ, అడ్డగుట్ట, వాంబే కాలనీ, భవానీమాతా టెంపుల్, ద్వారకా నివాస్ పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

వెంకటాద్రినగర్, ఎస్‌బీహెచ్, ఆస్మాన్‌గఢ్, భూలక్ష్మీనగర్, సవేరా టిఫిన్ సెంటర్, బొమ్మనా బ్రదర్స్, ఆర్‌ఎస్ బ్రదర్స్, రాజీవ్‌చౌక్, సాయిబాబా టెంపుల్, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్‌రోడ్, సాకేత్ డిగ్రీ కాలేజ్, సాయి డిగ్రీ కాలేజ్, సంతోషిమాతా టెంపుల్ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్ బస్ డిపో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.31, వంకాయ రూ.45, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.20, బీరకాయ రూ.32, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.26, క్యారెట్ రూ.55, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.36, ఉల్లిగడ్డ రూ.45, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.28, సొరకాయ రూ15, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.50, చామగడ్డ రూ.35, మునగ రూ.155, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.50, కీర రూ.28, బీన్స్ రూ.50, క్యాప్సికమ్ రూ.70. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

పుస్తెమెట్టెల అందజేత

నాగోలు: పేదలకు చేయూతను అందించేందుకు ఉప్పల ఫౌండేషన్ ముందుంటుందని చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. కర్మన్‌ఘాట్‌కు చెందిన శిరీష వివాహానికి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా దంపతులు గురువారం పుస్తె, మెట్టెలు, చీర అందజేశారు.

అక్రమ పార్కింగ్‌ను అరికట్టండి

చాదర్‌ఘాట్: రహదారులపై అక్రమ పార్కింగ్‌ను అరికట్టాలని గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాబు శ్రీనివాస్ గురువారం మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సలీంనగర్‌లోని ఓ షోరూం, వర్క్‌షాపులోని వాహనాలను ఇష్టానుసారంగా రహదారులపై పార్కింగ్ చేస్తుండటంతో బాటసారులు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వెంటనే రోడ్లపై పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

కాలనీ ఆర్చీ ప్రారంభం



చైతన్యపురి: సాయినగర్ కాలనీ శివాజీ చౌక్‌లో అక్రమ పార్కింగ్‌లు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తామని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అన్నారు. కాలనీవాసి వేణుగోపాల్ చారి సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సాయినగర్ కాలనీ ఆర్చీని గురువారం కార్పొరేటర్ ప్రారంభించారు. కాలనీలోని శివాజీ చౌక్ చుట్టూ అక్రమంగా పార్కు చేస్తున్న వాహనాలు, తోపుడు బండ్లు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. శంకర్, సురేందర్‌రెడ్డి, నరేందర్, నితిన్, అభిలాష్, వాసుదేవరెడ్డి ముత్యాలు పాల్గొన్నారు.

వనస్థలిపురం డివిజన్ అభివృద్ధికి కృషి

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీలో స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ కాలనీ సంక్షేమ సంఘాలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులతో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అధ్వాన స్థితికి చేరుకున్న డ్రైనేజీ వ్యవస్థను మళ్లీ నిర్మించడం, రోడ్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం తదితర సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ కోసం హయత్‌నగర్‌లో భవనం ఏర్పాటుకు స్థలం కేటాయింపుతో పాటు నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో నర్సింహాయాదవ్, రామారావు, పాశం అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

పండ్ల మార్కెట్ చిరువ్యాపారులకు న్యాయం చేయాలి


చిలుక మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

నాగోలు: గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించి తగిన న్యాయం చేయాలని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్ హాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొజంజాహి మార్కెట్ నుంచి గడ్డి అన్నారం పండ్ల మార్కెట్‌లో గత 35 ఏళ్లుగా చిరు వ్యాపారం చేసుకుంటున్నామని ట్రాఫిక్ ఇబ్బందులతో 2004లో మార్కెట్ అధికారులు తమకు డీ- క్లాస్ దుకాణాల ముందు స్థలం కేటాయించారన్నారు. 2006లో అగ్నిప్రమాదం చోటు చేసుకోగా ఇంతలో మార్కెట్ యార్డుకు కొత్త కార్యదర్శిని నియమించడంతో అక్కడ చిరు వ్యాపారులు వ్యాపారం చేయవద్దని చెప్పడంతో తాము 2010లో కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ చేయక ముందు మార్కెట్ అధికారులు మా దుకాణాలను కూల్చివేశారన్నారు. కొన్ని నెలల తర్వాత మార్కెట్ అధికారులు తమను పిలిపించి కోర్టులో కేసు విత్‌డ్రా చేసుకుంటే పర్మినెంట్ దుకాణాలు ఇస్తామని చెప్పడంతో విత్‌డ్రా చేసుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి దుకాణాలు తమకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ కమిటీ ప్రతినిధులు, అధికారులు తమకు తగిన న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. వినతి ఇచ్చిన వారిలో అధ్యక్షులు మహమ్మద్ మొయినుద్దీన్, సెక్రటరీ కసిరెడ్డి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు ఎల్. రాజు, ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, కోశాధికారి సంషోద్దీన్, మహమ్మద్ ఇస్మాయిల్, మహమ్మద్ షరీఫ్ ఉన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

నాగోలు: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఎల్‌బీనగర్ డివిజన్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని బండ్లగూడ మధురనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. దొంగతనాలు, చైన్‌స్నాచింగ్, ఇతర నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. అన్ని కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తానని కార్యాలయాలు, ఇళ్లలో వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ సూర్య నాయక్, ఎస్సై శివ నాగప్రసాద్, కాలనీ అధ్యక్షుడు ధనరెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు మనిదీప్, సూర్య ప్రకాష్, సాయికిరణ్, వెంకటేష్, అరుణ్ యాదవ్, కార్తీక్, సురేష్ పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ కృష్ణయ్య

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి


కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

లింగోజిగూడ: మాలల సింహగర్జన కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరై విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ సత్యనారాయణ పిలుపునిచ్చారు.లింగోజిగూడ డివిజన్ మాలల సొసైటీ అధికార ప్రతినిధి పర్సాపు శ్రీధర్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని గురువారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింహగర్జనను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల్వంత్‌రావు, జీవన్, శంకర్, మధు, రాంబాబు, రాములు, కట్ట వెంకటేశ్, నరసింహ, ఆనంద్ రాజ్, రెడ్డి మాల కృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: తెలంగాణ చౌరస్తాలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు.బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి తెలంగాణ చౌరస్తాలోని సమస్యలపై పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో గురువారం ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ చౌరస్తా మీదుగా సుమారు 50 కాలనీలకు ప్రజలు రాకపోకలు సాగిస్తారని దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. చౌరస్తా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, కృష్ణ వాటర్ ఛాంబర్‌ను వెనక్కి జరిపితే సమస్య పరిష్కారం అవుతుందని వెంటనే ఆ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో అరవింద్‌రెడ్డి, సుమన్‌గౌడ్, అనిల్‌చౌదరి, ప్రభాకర్‌రెడ్డి, పోగుల రాంబాబు, శివముదిరాజ్ ఉన్నారు.

సెల్‌టవర్ వద్దంటూ ఆందోళన


ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే సెల్ టవర్లను తమ కాలనీలో ఏర్పాటు చేయొద్దంటూ హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీవాసులు గురువారం సంబంధిత భవనం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కాలనీలో సెల్ టవర్లు ఏర్పాటు చేయవద్దని చెబుతున్నా పట్టించుకోకుండా ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ విషయంలో తాము కోర్టును ఆశ్రయించనున్నామని అధికారులు స్పందించి తమ కాలనీలో టవర్ ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్, రమణ, శేఖర్, సాగర్, అచ్చాలు గౌడ్, విజయ్ బాబు, బాలేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.డివిజన్‌కు చెందిన జావిడి మధన్ గుండెకు సంబంధించిన వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఆర్థికంగా ఆదుకోవాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఆయనకు మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం మధన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, పల్సం శ్రీధర్‌గౌడ్, యశ్వంత్‌కుమార్, కరణ్‌కుమార్, శ్రీకాంత్, లక్ష్మారెడ్డి, గౌస్ పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం


క్రీడా సమావేశాన్ని ప్రారంభిస్తున్న డీసీపీ అరవింద్ బాబు

దిల్‌సుఖ్‌నగర్/వనస్థలిపురం: నారాయణ స్కూల్ క్రీడా సమావేశాలు ఉత్సాహంగా ప్రారంభం అయ్యాయి. గురువారం సరూర్‌నగర్ స్టేడియంలో డీసీపీ అరవింద్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా సమావేశాలను ప్రారంభించి మాట్లాడారు. పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యానికి ఆటలు ఎంతో ఉపయోగపడుతాయని, ఆటల ద్వారా ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్‌రెడ్డి, ఏజీఎం హేమాంబర్, ఆర్‌ఐ రవి ప్రసాద్, శివరంజనీ, మహేశ్వరీ, ప్రిన్సిపాల్ నీరజ పాల్గొన్నారు.



చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు

నాగోల్ సాయినగర్ కాలనీ రోడ్ నంబర్-1 లోని రాక్‌వుడ్స్ పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన సైన్స్ ఫేయిర్ ఆకట్టుకుంది. వివిధ తరగతుల విద్యార్థులు తమదైన శైలిలో వివిధ నమూనాలు రూపొందించి వాటి పనితీరును వివరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు.

–సాక్షి, సిటీబ్యూరో

